
కథ

# హర హర మహాదేవ

కవనశర్మ - సత్యశారద

వింధ్యకి దక్షిణాన్న ఒక పెద్ద నేరేడు చెట్టు. దాని మీద ఓ చిన్న వానరుడు. హాయిగా పండ్లు తింటూ పళ్లికిలిస్తూ కూర్చుని ఉన్నాడు. ఇంతలో వాళ్ల నాన్న "వాలకా ఎక్కడున్నావురా?" అంటూ వెతుక్కుంటూ వచ్చాడు. వాలకుడు జవాబు చెప్పలేదు. వాడికి నచ్చే ఆటల్లో తండ్రితో ఆడే దొంగాట ముందుంటుంది. ఆకుల చాటున దాక్కున్నాడు. కాని తండ్రికి కనిపించిపోయాడు.



తండ్రి "నేనోడిపోయాన్రా! ఏ చెట్టు మీదున్నావో దిగరా!" అంటూ చూడనట్టు బతిమాలాడు. వాలకుడు నవ్వుతూ దూకాడు.

"ఏమిటి నాన్నా!" అని అడిగాడు.

"ఎప్పుడూ చిరుతిళ్లేనా? నాలుగు అరటిపి పళ్లు తెచ్చాను. తిందువుగాని రా. పిల్లలు బలమైన తిండి తినాలి."

"నాకు బలం వస్తే ఈసారి రాక్షసులతో యుద్ధానికి నన్ను తీసుకొని వెళ్తావా?"

"ఓ అల్లాగే!"

వాలకుడు గబగబా ఆ పళ్లు తినేసి మిగిలిన వానర బాలకులతో ఆడుకోడానికి వెళ్లిపోయాడు. తండ్రి రాజుగారి కొలువుకు వెళ్లాడు. అక్కడ చాలా హడావిడిగా ఉంది. సుగ్రీవ మహారాజు, దేశం నలుమూలల నుంచి వానరులు, జాంబవులు తను రావణాసురుడితో చేయబోయే యుద్ధానికి సహాయంగా రావలసిందిగా కబురు పెట్టాడుట. సమయం లేదు. వెంటనే బయల్దేరాలి!

వాలకుడి తండ్రికి బెంగ పట్టుకుంది. సుగ్రీవాజ్ఞను మీరడానికి లేదు. తను బయల్దేర్తే వాలకుడు వెంట బయల్దేరక మానడు. తల్లి వాలకుడిని కంటూనే చనిపోవడంతో, వాడ్ని తను చాలా గారాబంగా, తన ప్రాణం కంటే మిన్నగా పెంచుకున్నాడు. ఇలా ఆలోచిస్తుంటే అతని రాజు "రానియ్యి! ఫర్వాలేదు. అగ్ని కొడుకు నీలుడు వస్తున్నాడు. వాడూ అల్లరి చిల్లరి వాడే. వాలి కొడుకు అంగదుడు వస్తున్నాడు. వాడికిప్పుడే కాస్త బుద్ధి కుదురు వస్తోంది. కాని పూర్తిగా ఆటకోతితనం పోలేదు. విశ్వకర్మ కొడుకు నలుడు తండ్రిలాగా మంచి సేతుశిల్పి అయ్యాడట. అతనికి వాలకుడిని సహాయంగా పెడ్దాం!" అని ధైర్యం చెప్పాడు.

అరటి పళ్లు తిన్న వెంటనే ఫలితం కనిపించినందుకు వాలకుడు సతోషించాడు. వానరమూక బయల్దేరింది. దారి పొడుగునా మరో ప్రాంతం నుంచి వస్తున్న మూకలు కలిశాయి.

వాలకుడికి మంచి సరదాగా ఉంది. అందరూ నడుస్తూ, మధ్య మధ్యలో

'రాముడికి జై', 'సుగ్రీవుడికి జై' అని అరుస్తుంటే తనూ గెంతుతూ ఉత్సాహంగా అరవసాగాడు. నెమ్మదిగా వానరసందోహం కిష్కింద చేరింది.

ఎత్తుగా ఉన్న ఆసనం మీద కూర్చున్నవాడు లేచి, ''రేపు మనం లంకకి బయల్దేరబోతున్నాం'' అని చెప్పాడు. వాలకుడు ''అతను ఎవరు నాన్నా?'' అని తండ్రినడిగాడు.

''ఆయనే సుగ్రీవుడు. మనందరికి మహారాజు'' అన్నాడు.

అప్పుడు వాలకుడు ''సుగ్రీవ మహరాజుకీ జై'' అని అరిచాడు. అందరూ జై అని వంత పలికారు. తనకంత మంది వంత పలుకుతుంటే వాలకుడు రెచ్చిపోయి మరో రెండు సార్లు జయజయలు చెప్పించాడు.

సుగ్రీవుడు సంతోషించి ''నీలా! అంగదా! ఈ బుడతడిని మీ గుంపులో చేర్చుకోండి. సైనికులని ఉత్సాహపరచడానికి పనికి వస్తాడు'' అన్నాడు. వాలకుడి తండ్రి ''ధన్యుడిని మహారాజా'' అన్నాడు.

వాలకుడికీ అన్నీ ప్రశ్నలే! ''వాళ్లిద్దరూ ఎవరు? వాళ్లకి తోకలెందుకు లేవు?''

''వాళ్లు రామలక్ష్మణులా? వాళ్లు జుట్టు దువ్వుకోలేదేం? వాళ్లు మనతో ఎందుకు వస్తున్నారు?''

''వాళ్లతో మనం వెళ్తున్నామా? మనతో వాళ్లు రావడం లేదా?''

''వాళ్లతో మనం ఎందుకువెళ్తున్నాం?''

''సీతను రావణాసురుడెత్తుకుపోతే ఈ రాముడు మరో అమ్మాయిని పెళ్లి చేసుకోవచ్చుగా?''

నీలుడికి వాలకుడు నచ్చాడు. కాని అంగదుడిప్పుడేగా గాంభీర్యం అలవర్చుకుంటున్నాడు. తను యువరాజు మరి. అందుకని ''అల్లరి చేస్తే తోకలు కోసేస్తాను జాగ్రత్త'' అని హెచ్చరించాడు.

నీలుడు వాలకుడికి తన విద్యలు ప్రదర్శించాడు. నీళ్లలో అతను రాళ్లు వేస్తుంటే అవి బుడుంగున మునిగి నట్టే మునిగి తేలడం చూసి వాలకుడు చప్పట్లు కొట్టాడు.

''ఈ ఎలుగు బంటిలా ఉన్న అతను ఎవరు?'' అని వాలకుడు వినయంగా నీలుడిని అడిగాడు.

''ఆయన జాంబవంతుడు. బ్రహ్మ కొడుకు. ఇంద్రుడితో యుద్ధం చేసినవాడు. గొప్ప బలవంతుడు, జ్ఞాని.''

''ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుంటున్నాడు. మరి ఆయనెవరు?''

''ఆయనే హనుమంతుడు. లంకలో సీత ఉందని చూసి తెలుసుకొని వచ్చి చెప్పినవాడు. లంకకి నిప్పు కూడా అంటించాడు.''

అది వినగానే వాలకుడికి ఉత్సాహం వచ్చింది. మెల్లగా హనుమంతుడి పక్కన జేరి, ''పెదనాన్నా! పెదనాన్న! ఈసారి లంకకి వెళ్లినప్పుడు నువ్వు లంకకి నిప్పు పెడ్తావు కదా! అప్పుడు నేను కూడా నీతో ఉంటాను'' అన్నాడు.

హనుమంతుడు వాత్సల్యం చూపుతూ, ''అనవసరంగా ఏదీ పాడు చెయ్యనా కొడకా! అప్పుడు వాళ్లు నా తోకకి నిప్పు పెట్టారు మరి. అందుకని కాల్చాను. వాళ్లు మళ్లీ ఆ పని చెయ్యాలి కదా, నిప్పు పెట్టాలంటే! అప్పుడు దూతని. అందుకని వాళ్లకి దొరికాను. ఇప్పుడు వాళ్లకి దొరకను కదా!'' అన్నాడు. తన శక్తి గురించి వాలకుడికి తెలియదు పాపం అనుకొన్నాడు. తనకే తెలియదు మరి!

వాలకుడికి లంకకి నిప్పంటించడం లాంటి సరదా ఉండబోదని కొంచెం నిరుత్సాహపడినా, పెదనాన్న తోకకి నిప్పు పెట్టడం లాంటి ఆలోచన కూడా నచ్చలేదు.

''పోన్లే! అయినా వాళ్లు నా తోకకి నిప్పు పెడ్తే నేను నా తోకని కాపాడుకోలేను కూడాను'' అనుకున్నాడు.

''అక్కడ పళ్ల చెట్లెక్కి అన్నీ పళ్లూ కోసేద్దాం! తినేద్దాం! ఏం?'' నిప్పంటించడానికి బదులుగా మరోటి సూచించాడు.

''అల్లాగే బిడ్డా!'' అన్నాడు వాయుపుత్రుడు.

వానరసేన బయల్దేరింది. అందరిది ఒక తోవ. వాలకుడి వాలకం వేరు. ''యుద్ధం అంటే అది తన మిత్రులతో చేసే మల్ల యుద్ధమో, ముష్టియుద్ధమో అనుకొంటున్నాడు. బయల్దేరిన వారిలో కొందరికి వెనక్కి రారన్న స్పృహ లేదు. ''నేను వెనక్కి రాకపోతే వీడేమైపోతాడు'' అని తండ్రి బెంగపెట్టుకున్నాడు.

లంకని దక్షిణాపథాన్ని కలిపే భూమార్గం అక్కడక్కడ నీటి కింద మునిగిపోయి ఉంది. మునిగిన భాగం మీద రాళ్లు పేర్చి నీటి మట్టానికి పైగా దారి ఏర్పరిచే పని నీలుడికి అప్పజెప్పారు.

నీలుడు వేసిన రాళ్లు తేలిపోతుంటే, మిగిన వాళ్ల చేత మునిగిపోయిన భాగం మీద రాళ్లు వేయించారు. ''అందరూ ఒక లయ ప్రకారం పనిచెయ్యాలన్నాడు'' నీలుడు. ''రామ-శ్రీరామ'' అంటూ లయ బద్ధంగా రాళ్లు పేర్చసాగారు. ఆ లయగా అనే పని వాలుడికి అప్పజెప్పారు. నీలుడు వేసిన రాళ్లు నీళ్ల మీద తేలి కెరటాలకి కొట్టుకుపోతుంటే నలుడు తీగలు తెప్పించి వాటిని మోకులుగా పేని రాళ్లని బంధించసాగాడు. వాలుడు ఇది 'రా', ఇది 'మా' అంటూ రాళ్లకి పేర్లు పెట్టి పాడసాగాడు.

ఒక ఉడత వచ్చి తన శక్తి కొద్దీ మట్టి వేయడం మొదలుపెట్టింది. రాముడు దాని వీపుని నిమిరాడు. ఆ సమయంలో వాలుడు వెళ్లి ఉడత పక్కన నిలబడ్డాడు. రాముడు వాలుడి తోకని నిమిరాడు. వాలుడు సంతోషంగా కిచకిచలాడాడు.

ఆ తరువాత ''హరహర మహదేవా!'' అంటూ భయంకర యుద్ధం జరిగింది. అది చూసి వాలుడు బిత్తరపోయాడు. అది సరదాగా చేస్తున్న ఉత్తుత్తి గదా యుద్ధాలు, ముష్టియుద్ధాలు; మల్ల యుద్ధాలు గావు. ఇటు వానరులు, అటురాక్షసులు చనిపోయారు. రావణాసురుడు చనిపోవడంతో యుద్ధం ఆగిపోయింది. శివతాండవం ఆగిపోయింది.

లక్ష్మణుడు, విభీషణుడు సీతను తీసుకొచ్చారు. సీత చితిలో ప్రవేశించింది. అగ్ని ఆమెను బయటకు తీసుకు వస్తుంటే ''అదుగో మా నాన్న'' అని అరిచాడు నీలుడు.

''పెదనాన్నా'' అని అరిచాడు వాలుడు.

''ఆవిడెవరు?'' వాలుడు అడిగాడు.

''ఆవిడే సీత'' నీలుడు చెప్పాడు.

''ఎంత బావుందో!'' అన్నాడు వాలుడు.

''ఎవరి అమ్మ వాళ్లకి బావుంటుంది. ఆవిడ మన అందరికి అమ్మ కదా!'' అన్నాడు భక్తిగా హనుమంతుడు.

''అమ్మా!'' అంటూ వాలుడు సీత దగ్గరకు పరిగెత్తాడు. పిల్లలు లేని సీత వాలుడిని అక్కున జేర్చుకుంది.

రాముడు చిరునవ్వు నవ్వాడు.

''ఇంత మంది చచ్చిపోయింది ఈ అమ్మ కోసమే కదా'' అనుకొన్నాడు వాలుడు.

''ఈ అమ్మే ధర్మం. ధర్మంకోసం పోరాడక తప్పదు. ఈ అమ్మే పవిత్రత'' అన్నాడు హనుమంతుడు.

వాలుడు పాడుకొన్నాడు, ''సీతమ్మ నా యమ్మ, శ్రీరాముడు నా తండ్రి'' అంటూ..

*



## 'ఐటమ్ గర్ల్'ను కాను....

'తెలుగు సినిమాలలో ఐటమ్ సాంగ్స్ చేసినంత మాత్రాన, తనను ఐటమ్ గర్ల్ అనడం ఎంత వరకు సమంజసం?' అంటూ సెక్సీ భామ శ్రియ అంటోంది. 'బాలీవుడ్, కోలీవుడ్‌లలో బిజీగా ఉండడం వలన టాలీవుడ్‌లో చేయలేకపోతున్నాననీ, తనను ఎంతగానో ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అడపాదడపా ఐటమ్ సాంగ్స్‌లో నటిస్తున్నానే తప్ప హీరోయిన్‌గా ఛాన్స్ రాక కాదు' అంటూ పెద్ద లెక్చర్ ఇస్తోంది. అయితే ప్రస్తుతం శ్రియ నటించిన సినిమాలు ఎంత ఫ్లాప్ అయ్యాయో ఆమె కన్నా, ప్రేక్షకులకే ఎక్కువ తెలుసని పరిశ్రమలోని వారంటున్నారు. ఏమైనా శ్రియ దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుంటే మంచిదని మరికొందరు ఉచిత సలహా పారేస్తున్నారు.